# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## కరీంనగర్

రాజన్న సిరిసిల్ల , జగిత్యాల, పెద్దపల్లి

ఆదివారం 04 అక్టోబర్ 2026




## షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణే ధ్యేయం



- రాజకీయాలకతీతంగా ఉద్యమ కార్యాచరణకు ప్రణాళిక
- సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి స్పష్టీకరణ

వివరాలు 8లో..

## ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి

- ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని రాణించాలి



3లో

బీసీలను ఏకం చేయాల్సిన వేళ..

## బీఆర్ఎస్‌లో విభేదాల సెగ..!

ఘర్షణతో ఆర్ఆర్ గార్డెన్‌లో ఉద్రిక్తత

- సమావేశం కాస్తా.. సార్వత్రిక సమరమైంది!



5లో

# అనుమతులు లేకుండా కాంట్రాక్టర్ మట్టి తరలింపు

- జేసీబీతో తవ్వకాలు, టిప్పర్లతో రవాణా
- అధికారులు చర్యలు తీసుకోవాలని నర్సింగాపూర్ గ్రామస్థుల డిమాండ్



7లో

## కరీంనగర్‌ను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

### మేయర్ కొలగాని శ్రీనివాస్



10లో

- వివిధ డివిజన్లలో రూ.1.53 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- డివిజన్లలో ముమ్మరంగా సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి పైప్‌లైన్ పనులు




# కోరుట్లలో కార్పొరేట్ స్కూళ్ల ఫీజుల దౌర్జన్యం!

- బకాయిలు ఉంటే పిల్లలను స్కూల్‌కు పంపొద్దంటూ తల్లిదండ్రులకు హెచ్చరికలంటూ ఆరోపణలు
- పిల్లలతో చెలగాటం.. తల్లిదండ్రులపై ఫీజుల భారం
- కార్పొరేట్ స్కూళ్ల తీరుపై తల్లిదండ్రుల ఆగ్రహం.. విద్యాశాఖ అధికారుల మౌనంపై ప్రశ్నలు

కోరుట్ల పట్టణంలో కొన్ని కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల వసూళ్ల వ్యవహారం విద్యార్థులు, తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. చదువుకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన విద్యాసంస్థల్లో ఫీజుల వసూళ్లకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు తల్లిదండ్రుల నుంచి వస్తున్నాయి.

12

PRAJA JYOTHI 04-10-2026_1 10/4/2026 1:24 AM Page 2





# ఇది విద్యా? వ్యాపారమా?

## ఫీజు బకాయిపై హిల్ఫోర్ట్ దాష్టకం

- పరీక్ష గది నుండి వెళ్ళగొట్టిన యాజమాన్యం
- ఎంఈఓకు విద్యార్థి తండ్రి ఫిర్యాదు
- పాఠశాల నిర్వహణ తీరుపై విమర్శలు

**రామగిరి, అక్టోబర్ 03 (ప్రజాజ్యోతి):**
ఫీజు చెల్లించలేదనే కారణంతో రెండో తరగతి విద్యార్థిని పరీక్ష రాస్తున్న గది నుంచి బయటకు పంపారంటూ సెంటినరీ కాలనీలోని హిల్ ఫోర్ట్ స్కూల్పై విద్యార్థి తండ్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు చెల్లించేందుకు కొంత సమయం ఇవ్వాలని కోరినా పాఠశాల యాజమాన్యం పట్టించుకోలేదని, పరీక్ష సమయంలో విద్యార్థి నుంచి పేపర్ తీసుకుని బయటకు పంపినట్లు తండ్రి రామగిరి మండల ఎంఈఓ కొమురయ్యకు అందజేసిన లిఖితపూర్వక ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫీజు బకాయి ఉంటే తల్లిదండ్రులతో మాట్లాడి పరిష్కరించుకోవాల్సి ఉండగా, చిన్నారిని పరీక్షకు దూరం చేయడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితికి చిన్నారిని బాధ్యుడిని చేయడం సరికాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. పరీక్ష రాస్తున్న సమయంలో జరిగిన ఈ ఘటనతో విద్యార్థి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. పాఠశాల పిల్లలకు భయం కలిగించే ప్రదేశంగా కాకుండా భరోసా, ఆత్మవిశ్వాసం కల్పించే వాతావరణంగా ఉండాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

### యూనిఫాం విషయంలోనూ ఒత్తిడి?

ఇదే ఫిర్యాదులో పాఠశాల యాజమాన్యంపై మరో ఆరోపణను విద్యార్థి తండ్రి ప్రస్తావించారు. పాఠశాల సూచించిన దుకాణంలోనే యూనిఫాం కొనుగోలు చేయాలని తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. ఫీజులు, యూనిఫాం తదితర అంశాల్లో పాఠశాల యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరుపై సమగ్ర విచారణ జరిపించాలని ఎంఈఓను కోరారు. విద్యను ధనార్జనే ధ్యేయంగా నిర్వహిస్తున్నారన్న ఆరోపణలను కూడా ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం.

### చిన్నారి మనసుపై ముద్ర పడకూడదు

రెండో తరగతి చదువుతున్న చిన్నారికి ఫీజు బకాయి, పాఠశాల నిర్వహణ ఖర్చుల కంటే చదువు, ఆటలు, స్నేహితులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహమే ముఖ్యమని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఫీజు చెల్లింపులో తల్లిదండ్రులకు ఇబ్బందులు ఉండొచ్చు.. పాఠశాలకు నిర్వహణ ఖర్చులు ఉండొచ్చు. అయితే ఈ సమస్య ప్రభావం చిన్నారి చదువు, ఆత్మగౌరవం, మానసిక ప్రశాంతతపై పడకూడదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తల్లిదండ్రి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసే పరిస్థితి రావడం హిల్ ఫోర్ట్ పాఠశాల పనితీరుపై అధికారుల పర్యవేక్షణ అవసరాన్ని సూచిస్తోంది. ఈ ఒక్క ఫిర్యాదును పరిష్కరించడంతో పాటు మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు, యూనిఫాంలు, ఇతర వసూళ్లపై కూడా అధికారులు పర్యవేక్షణ పెంచాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

---

## తనుశ్రీ ఇన్ఫ్రా సిబ్బందికి నూతన దుస్తుల పంపిణీ

**తిమ్మాపూర్, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):**
కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తనుశ్రీ ఇన్ఫ్రా డెవలపర్స్ హెడ్ ఆఫీస్లో తనుశ్రీ మేనేజ్మెంట్ సిబ్బందికి సంస్థ చైర్మన్ ఓ మేనేజింగ్ డైరెక్టర్ ఎలుక సంతోష్ శనివారం నూతన దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బతుకమ్మ, విజయదశమి పండుగలను సాంప్రదాయబద్ధంగా జరుపుకుని అందరూ ఆనందోత్సాహాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎలుక దేవన్న, వాసలా శ్రీనివాస్, గణేష్, అంజన్న, తంబాల నరేష్, రఘుపతి, శ్రీనివాస్, నరేష్, ఎండీ అఖిల్ తిరుపతి, డి. జ్యోతి, సౌమ్య రెడ్డి, లలిత, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాసంకల్ప సేవా బైక్ యాత్రకు ఘన స్వాగతం

**కరీంనగర్ టౌన్, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):**
తిరుపతి నుంచి వారణాసి వరకు కొనసాగుతున్న ప్రజాసంకల్ప సేవా బైక్ యాత్ర శనివారం కరీంనగర్కు చేరుకున్న సందర్భంగా తెలంగాణ తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. హైదరాబాద్ రహదారిలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద యాత్రికులను శాలువాలు, పూలమాలలతో సత్కరించి సంఘీభావం తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వానికి సంఘీభావంగా ఈ యాత్ర సాగుతోందని నాయకులు పేర్కొన్నారు. యాత్రలో పాల్గొంటున్న పొగాకు జైరాం చందర్, తాళికోట హరికృష్ణ, యలమంచిలి శివ చౌదరి, దుర్గ ప్రసాద్లను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో టిటిడిపి నాయకులు నాగుల బాలగౌడ్, దామెర సత్యం, రొడ్డ శ్రీనివాస్, సందబోయిన రాజేశం, ఎల్లిమిళ్ల కిషన్, ఇట్టా మల్లేశం, ఎర్రవెల్లి రవీందర్, తాటికొండ శేఖర్, వాడ్కాపురం లక్ష్మిరాజ్యం, దాసరి రామకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# ప్రైమరి తరగదిని ప్రారంభించిన సర్పంచ్.

## విద్యాభివృద్ధి లో తల్లి తండ్రులు భాగస్వాములు కావాలి

**ఎలిగేడు, అక్టోబర్ 3 ( ప్రజా జ్యోతి ) :**
విద్యాభివృద్ధి లో తల్లి తండ్రులు భాగస్వాములు కావాలని మండల విద్యా అధికారి అనసూరి నరేంద్ర చారీ, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం గంగ్ర దేవేందర్ రావు లు అన్నారు. శనివారం మండలం లోని ముప్పిరి తోట ఎంపిపిఎస్‌లో ప్రీ - ప్రైమరి పాఠశాల గదిని ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమం వారు మాట్లాడారు.ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులకు నాణ్యమైన విద్యతో పాటు ఆహ్లాదకరమైన అభ్యసన వాతావరణాన్ని కల్పించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించి, వారి విద్యాభివృద్ధిలో తల్లిదండ్రులు భాగస్వాములు కావాలన్నారు ప్రీ-ప్రైమరీ స్థాయి నుంచే పిల్లలకు మంచి విద్యా పునాది ఏర్పడాలని, ఆటపాటలతో కూడిన విద్య పిల్లల్లో పాఠశాల పట్ల ఆసక్తిని పెంపొందిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో సర్పంచ్ రామిడి శైలజ వెంకట్రామి రెడ్డి, ఉప సర్పంచ్ రాయమల్లు, హెచ్ ఎం సంపత్, జిపి కార్యదర్శి శిరీష, జిపివో సదానందం గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# హరిదాస్ నగర్‌లో 3.14 కోట్లతో సబ్ స్టేషన్ మంజూరు

## ...సర్పంచ్ చిర్రం నాగరాజ్ కృతజ్ఞతలు

**ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):**
ఎల్లారెడ్డిపేట మండలంలోని హరిదాస్‌నగర్ గ్రామానికి రూ. 3.14 కోట్ల వ్యయంతో నూతన విద్యుత్ సబ్ స్టేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ సబ్ స్టేషన్ మంజూరు కావడం పట్ల గ్రామానికి చెందిన రైతులు, ప్రజల తరఫున గ్రామ సర్పంచ్ చిర్రం నాగరాజ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. సబ్ స్టేషన్ మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ కేకే మహేందర్ రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే చొరవ చూపిన ఎన్పీడీసీఎల్ డీఈ, ఏడీఈ, ఏఈ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. సబ్ స్టేషన్ ఏర్పాటుతో గ్రామంలో విద్యుత్ సమస్యలు తొలిగి, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందుతుందని పేర్కొన్నారు.




# ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి

- ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని రాణించాలి
- పెద్దూర్ బీసీ గురుకులంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మిక తనిఖీ



**రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 3 (ప్రజాజ్యోతి):**
ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని తమ లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ వద్ద గల మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల విద్యాలయాన్ని శనివారం సాయంత్రం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని స్టోర్ రూమ్‌ను పరిశీలించి బియ్యం, కూరగాయలు, పండ్లు, నెయ్యి నాణ్యతను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు క్రమం తప్పకుండా గుడ్లు, చికెన్, మటన్ అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ఆర్ఓ వాటర్ ప్లాంట్‌తో పాటు వసతి గదులు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రెసిడెన్షియల్ విద్యాలయాల్లో చదివే అవకాశం రావడం ఒక మంచి అవకాశమని, దీనిని పూర్తిగా ఉపయోగించుకోవాలని సూచించారు. గురుకులాల్లో భోజన నాణ్యతను పరిశీలించేందుకు మండల స్థాయి అధికారులను నియమించామని, వారు విద్యార్థులతో కలిసి భోజనం చేస్తారని తెలిపారు. చదువుతో పాటు రోజూ ఆటలు ఆడాలని, సంగీతం, డ్యాన్స్ వంటి నచ్చిన రంగాల్లో రాణించాలని చెప్పారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ సమయాన్ని వృథా చేయకుండా ఆదర్శవంతమైన పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు ఆకాంక్షించారు.

# భూముల రీ సర్వే కచ్చితత్వంతో చేయాలి

- ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలి
- తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్




**రాజన్న సిరిసిల్ల,అక్టోబర్ 3 (ప్రజాజ్యోతి):**
భూ భారతి కింద చేపడుతున్న భూముల రీ సర్వేను పూర్తి కచ్చితత్వంతో చేపట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. భూ భారతి, రీ సర్వే, ప్రత్యేక ఓటర్ సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అంశాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి తహసీల్దార్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వేకు ముందు రైతులకు సమాచారం అందించాలని, వివరాలను క్షుణ్ణంగా నమోదు చేయాలని సూచించారు. జిల్లాలోని 18 రోవర్ యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించాలని, అవసరమైన లైసెన్స్ సర్వేయర్లను నియమించి గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ భూముల సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. అలాగే ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటర్ సమగ్ర సవరణ ప్రక్రియలో ఏఎస్డీడీ (ASDD) జాబితాను తనిఖీ చేస్తూ ఫారం 6, 7, 8 దరఖాస్తులను సమయం ప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కేఎస్బీ కుమారి, సర్వే అధికారులు పాల్గొన్నారు.

# గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

**ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):**
ఎల్లారెడ్డిపేట మండలంలో గంజాయి అమ్ముతున్న పిట్ల నర్సింలు (అలియాస్ జిన్నా) అనే వ్యక్తిని శనివారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఓ. వెంకటేష్ తెలిపారు. గొల్లపల్లికి చెందిన శ్రీరామోజీ రాజేష్‌కు నర్సింలు గంజాయి విక్రయించగా, గతంలో రాజేష్‌పై కేసు నమోదైంది. పరారీలో ఉన్న నర్సింలును మద్దికుంటలో పట్టుకుని, అతడి ఫోన్‌ను సీజ్ చేశారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు ఉంటాయని సీఐ హెచ్చరించారు.



ప్రజాజ్యోతి

ఆదివారం 04 అక్టోబర్ 2026

# విద్యార్థుల్లో సామాజిక స్పృహ పెంచి ఉన్నత లక్ష్యాల వైపు నడిపించాలి

- విద్యార్థుల మనస్తత్వాన్ని గమనిస్తూ మార్గనిర్దేశం చేయాలి
- అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):**
విద్యార్థుల్లో సామాజిక స్పృహను పెంపొందించి, వారు జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించేలా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ట్రస్మా (౧=ూహీూ) రాజన్న సిరిసిల్ల జిల్లా ఆధ్వర్యంలో పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాలల్లో పిల్లలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సోషల్ మీడియా అధిక వినియోగం వల్ల విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడకుండా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి, దానిని బాధ్యతాయుతంగా ఎలా వాడాలో అవగాహన కల్పించాలని చెప్పారు. ఆపద సమయాల్లో ఎలా స్పందించాలో నేర్పించాలన్నారు. జిల్లాలో షీ టీమ్ ఆధ్వర్యంలో గుడ్ టచ్--బ్యాడ్ టచ్, బాలల రక్షణ, సైబర్ భద్రతపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రచారి,



ట్రస్మా నాయకులు యాదగిరి శేఖర్ రావు, నాగుల శ్రీనివాస్ గౌడ్, కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బొడ్డెమ్మ సంబరాలతో మార్మోగిన న్యూ అర్బన్ కాలనీ పాఠశాల



**వేములవాడ, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):**
వేములవాడలోని న్యూ అర్బన్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో బొడ్డెమ్మ పండుగ సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పండుగ ప్రారంభోత్సవంలో భాగంగా విద్యార్థులు పుట్టమన్ను తీసుకువచ్చి పీట బొడ్డెమ్మను తయారు చేశారు. అనంతరం పసుపుతో గౌరమ్మను రూపొందించి, సంప్రదాయబద్ధంగా బొడ్డెమ్మను ప్రతిష్ఠించి బతుకమ్మ ఆటపాటలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో బొడ్డెమ్మ పండుగకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. బతుకమ్మ పండుగకు ముందుగా భాద్రపద బహుళ పంచమి నుంచి చిన్నారులు, అవివాహిత యువతులు ఈ పండుగను జరుపుకుంటారని తెలిపారు. పుట్టమన్ను, పసుపుతో పీట, గుంట, పందిరి, బాయి, అంతరాల బొడ్డెమ్మలు అనే ఐదు రకాలుగా బొడ్డెమ్మను తయారు చేసి పూజించడం ఆనవాయితీ అని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, కంకెల్కార్ మోహన్, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజుల, పులి శారదతో పాటు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## బాలల బంగారు భవితకు పోషకాహారమే పునాది

...అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బ్లాండినా

**ధర్మారం, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):**
ధర్మారం మండలం పత్తిపాక అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో శనివారం పోషణ మాస వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ బ్లాండినా, గ్రామ సర్పంచ్ మాందాల శ్రావణి హరీష్ చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు పోషకాహారం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు సమతుల్య ఆహారం, పరిశుభ్రత అవసరమని తెలిపారు. అంగన్‌వాడీ ద్వారా అందించే గుడ్లు, పాలు, బాలామృతం క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించి పోషణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు అంజయ్య, మహేష్, హెచ్ఎం నూతి మల్లన్న, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఆర్నకొండ సింగిల్ విండో చైర్మన్‌గా యెన్నం మనోహర్

...నేడే బాధ్యతల స్వీకరణ



**చొప్పదండి, ఆగస్టు 22 (ప్రజా జ్యోతి):**
చొప్పదండి మండలం ఆర్నకొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సింగిల్ విండో) చైర్మన్‌గా చిట్యాలపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు యెన్నం మనోహర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడగా, శనివారం ఆయన పాలకవర్గంతో కలిసి బాధ్యతలు స్వీకరించనున్నారు. చైర్మన్ పదవికి పలువురు పోటీపడినప్పటికీ, పార్టీ కోసం నిరంతరం శ్రమించే బలహీన వర్గాల నాయకుడు యెన్నం మనోహర్ వైపే ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మొగ్గు చూపారు. ఆర్నకొండ సింగిల్ విండో పరిధిలో మంగళపల్లి, చిట్యాలపల్లి, రేవల్లి తదితర గ్రామాలు ఉన్నాయి. పార్టీకి చిత్తశుద్ధితో పనిచేసే నాయకుడికి అవకాశం కల్పించడంపై కాంగ్రెస్ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు ధన్యవాదాలు తెలిపారు. నూతనంగా ఎంపికైన చైర్మన్ యెన్నం మనోహర్, పాలకవర్గ సభ్యులకు పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

## మంతెన లింగయ్య కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

...రూ. 15,500 ఆర్థిక సాయం అందజేత

**ధర్మారం, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):**
ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మంతెన సాయిలు తండ్రి మంతెన లింగయ్య కుటుంబ సభ్యులను శనివారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు పరామర్శించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి, పార్టీ తరఫున ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కుటుంబ అవసరాల నిమిత్తం నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో సేకరించిన రూ. 15,500 ఆర్థిక సాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముత్యాల బలరాం రెడ్డి, గ్రామ సర్పంచ్ మోతె కనకయ్య, రైతుబంధు మండల మాజీ అధ్యక్షుడు పాకాల రాజయ్య, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు సామంతుల రమేష్, వార్డు సభ్యులు జెంగిలి గట్టుస్వామి, లక్ష్మణ్, తాళ్లపల్లి భాస్కర్, నాయకులు మద్దునాల వెంకటేశం, కుందేళ్ల మల్లేశం, ఠాకూర్ హనుమాన్ సింగ్, తొట్ల అనిల్, కలవేని రాజేశం, చొప్పరి కృష్ణ, కాంపెల్లి రాజయ్య, లచ్చయ్య, మదునయ్య, కొప్పుల వంశీ తదితరులు పాల్గొన్నారు.



# బీసీలను ఏకం చేయాల్సిన వేళ.. బీఆర్ఎస్‌లో విభేదాల సెగ..!



## ఘర్షణతో ఆర్ఆర్ గార్డెన్‌లో ఉద్రిక్తత

- సమావేశం కాస్తా.. సార్వత్రిక సమరమైంది!
- పెద్దపల్లి బీఆర్ఎస్‌లో బయటపడ్డ అసమ్మతి జ్వాలలు!
- ఏళ్లుగా ఉన్న సీనియర్లకు కనీస సమాచారం లేకపోవడంపై తీవ్ర ఆగ్రహం
- "ఇది వ్యక్తిగత పార్టీ కాదు.. బీఆర్ఎస్" అంటూ గులాబీ శ్రేణుల నిలదీత
- ఏకం చేయాల్సిన చోటే ఘర్షణ జరగడంపై క్షేత్రస్థాయి శ్రేణుల్లో చర్చ
- మాజీ ఎమ్మెల్యే తీరుపై నిరసన వ్యక్తంచేసిన పలువురు బీసీ నేతలు



**పెద్దపల్లి ప్రతినిధి, అక్టోబర్ 3, ప్రజా జ్యోతి:** బీసీ వర్గాల సమస్యలు, రాజకీయ ప్రాతినిధ్యం మరియు పార్టీ బలోపేతంపై చర్చించాల్సిన సమావేశం పెద్దపల్లి బీఆర్ఎస్‌లోని అంతర్గత విభేదాలకు బహిరంగ వేదికగా మారింది. శుక్రవారం పెద్దపల్లి పట్టణంలోని ఆర్ఆర్ గార్డెన్‌లో బీసీ నాయకులు, ముఖ్య కార్యకర్తలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి పలువురు సీనియర్లకు కనీస సమాచారం ఇవ్వలేదన్న ఆరోపణలు తీవ్ర వివాదానికి దారితీశాయి. సీనియర్ బీసీ నాయకుడు గంట రాములు యాదవ్‌తో పాటు ఏళ్లుగా పార్టీ కోసం నిబద్ధతతో పనిచేస్తున్న కార్యకర్తలకు సమాచారం ఇవ్వకపోవడంపై తీవ్ర నిరసన వ్యక్తమైంది. తమకు ఎందుకు వర్తమానం పంపలేదని ప్రశ్నించిన కార్యకర్తలపై దాడి జరిగి పలువురు గాయపడటంతో సమావేశ ప్రాంగణం వద్ద కొంతసేపు తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బీసీ నాయకులను, కార్యకర్తలను ఒకే తాటిపైకి తీసుకువచ్చి రాబోయే రోజుల్లో పార్టీని బలోపేతం చేయాల్సిన సమయంలో సమావేశ నిర్వహణ తీరుపై అసంతృప్తి వ్యక్తం కావడం స్థానికంగా పెద్ద ఎత్తున చర్చనీయాంశమైంది. ఈ సందర్భంగా కొందరు బీసీ కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిని ఉద్దేశించి "ఇది ఎవరి వ్యక్తిగత పార్టీ కాదు.. బీఆర్ఎస్ పార్టీ" అంటూ నేరుగా ప్రశ్నించినట్లు సమాచారం. ఈ నిలదీతల క్రమంలో మాటమాట పెరిగి ఘర్షణ ముదిరిందని బీసీ నాయకులు ఆరోపించారు. ఈ ఘర్షణలో గాయపడిన కార్యకర్తలను సీనియర్ నేత గంట రాములు యాదవ్, దాసరి ఉష తదితరులు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం ముఖ్య నాయకులు, కార్యకర్తలు జోక్యం చేసుకోవడంతో పరిస్థితి కొంతవరకు సద్దుమణిగింది. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం, పార్టీ పదవుల్లో ప్రాధాన్యత మరియు వర్గాల సమస్యల పరిష్కారం వంటి కీలక అంశాలపై సమీక్షించాల్సిన వేదికలోనే ఇలా విభేదాలు బహిర్గతం కావడం పార్టీ శ్రేణుల్లో తీవ్ర చర్చకు దారితీసింది. బీసీలను ఏకం చేసి క్షేత్రస్థాయిలో పార్టీకి పూర్వవైభవం తీసుకురావాల్సిన సమయంలో నాయకుల మధ్య సమన్వయం లోపిస్తే కార్యకర్తలకు ఎలాంటి సంకేతాలు వెళ్తాయన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఘర్షణ వాతావరణం మరియు ఆరోపణలపై మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి స్పందిస్తూ, తాము నియోజకవర్గంలోని అన్ని బీసీ వర్గాల నాయకులకు సమాచారం అందించామని స్పష్టం చేశారు. తాజా పరిణామాలతో పెద్దపల్లి బీఆర్ఎస్‌లో బీసీ నాయకుల మధ్య సమన్వయం మరియు సమావేశాల నిర్వహణ తీరుపై పార్టీ వర్గాల్లో తీవ్ర చర్చ నడుస్తోంది.

---

## కోనరావుపేటలో వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలు

### ...అటవీ అధికారుల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

**కోనరావుపేట, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):** జాతీయ వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా కోనరావుపేట మండలంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో శనివారం విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి మాధవి, సెక్షన్ అధికారి బీర్బల్ నేతృత్వంలో మండలంలోని పలు గ్రామాల్లో అటవీ సిబ్బంది భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. అడవులను కాపాడడం, వన్యప్రాణులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చాటుతూ ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో వన్యప్రాణుల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. అడవుల్లో అక్రమ వేటను అరికట్టాలని, జంతువులకు ఎలాంటి హాని తలపెట్టవద్దని విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలు, రైతులు అటవీ సంరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.




## బావుసాయిపేటలో విషాదం

### కట్న వేధింపులతో వివాహిత బలవన్మరణం

**కోనరావుపేట, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):** కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. అదనపు కట్నం వేధింపులు తాళలేక గెంటే రేణ (32) అనే వివాహిత శనివారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి అక్క గడ్డం మమత పోలీసులకు అందించిన ఫిర్యాదు ప్రకారం.. రేణకు 15 ఏళ్ల క్రితం గెంటే ప్రశాంత్‌తో వివాహం జరిగింది. గత నాలుగు నెలలుగా భర్త ప్రశాంత్, అత్త కొమురవ్వ, ఆడబిడ్డ పద్మ అదనపు కట్నం తీసుకురావాలంటూ తీవ్రంగా వేధిస్తుండటంతో మనస్తాపం చెంది ఈ దారుణానికి ఒడిగట్టింది. మృతురాలి అక్క ఫిర్యాదు మేరకు కోనరావుపేట ఎస్సై బి. రామ్మోహన్ కేసు నమోదు చేయగా, సీఐ కె. రవీందర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు వేగవంతం చేసినట్లు పోలీసులు తెలిపారు.





## 2500 శ్రీరామ కోటి పుస్తకాల పంపిణీ

**చొప్పదండి, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):** చొప్పదండిలో 2,500 శ్రీరామ కోటి పుస్తకాలను పంపిణీ చేసినట్లు స్థానిక హనుమాన్ భజన మండలి సభ్యుడు చీకట్ల లచ్చయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తుల నుంచి రామకోటి పుస్తకాలకు విశేష ఆదరణ లభిస్తోందని, శ్రీరామ కోటి రాస్తున్న భక్తులందరికీ ఆ కోదండ రాముని ఆశీస్సులు కలగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా చొప్పదండి పట్టణానికి చెందిన సుర రాజమణి--వైకుంఠం దంపతులు 21 శ్రీరామ కోటి పుస్తకాలను విజయవంతంగా పూర్తి చేసినందున వారిని ఘనంగా సత్కరించారు. ఆర్యవైశ్య మండల శాఖ, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి భజన మండలి ఆధ్వర్యంలో వారిని శాలువాతో సన్మానించి, అభినందనలు తెలియజేశారు.

## అనాథ విద్యార్థికి విద్యా ఫౌండేషన్ ఆర్థిక సాయం

**చొప్పదండి, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):** చొప్పదండి పట్టణంలోని గీర్వాణి విద్యాలయంలో ఒకటవ తరగతి చదువుతున్న అనాథ విద్యార్థి మారంపల్లి విశ్వక్ సేనకు స్థానిక విద్యా ఫౌండేషన్ ఆర్థిక సాయం అందజేసింది. శనివారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థి ఫీజుల నిమిత్తం నగదు సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా విద్యా ఫౌండేషన్ నిర్వాహకుడు పచ్చునూరి తిరుపతి మాట్లాడుతూ.. సమాజంలో నిరుపేద, వెనుకబడిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే తమ సంస్థ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. మానవతా దృక్పథంతో స్పందించి సదరు విద్యార్థి పాఠశాల రుసుమును తగ్గించిన గీర్వాణి విద్యాలయం చైర్మన్ కొండ గంగయ్యకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ పచ్చునూరి తిరుపతి, ప్రతినిధులు రాజేష్ పవార్, పైడి మహేష్, బొద్దుల వెంకటేశం, శ్యామల వెంకటేశం, మునీందర్, పాఠశాల ప్రిన్సిపల్ కొండ కిరణ్ కుమార్, ఇన్‌ఛార్జ్ సిరిపురం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# బీటీ రహదారి నిర్మించాలని విజ్ఞప్తి

- సొంత ఖర్చులతో రహదారిని చదును చేసుకున్న రైతులు
- రహదారి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే విజయరమణారావుకు విజ్ఞప్తి

**సుల్తానాబాద్, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):** సుల్తానాబాద్ మండల పరిధిలోని నారాయణపూర్ ఎస్సీ కాలనీ నుంచి ఉప్పరపల్లి మీదుగా చిన్నకల్వల వెళ్లే మట్టి రహదారిని రైతులు సొంత ఖర్చులతో శుభ్రం చేయించారు. రహదారికి ఇరువైపులా పెరిగిన చెట్లు, పొదలు, పేరుకుపోయిన మట్టిని ట్రాక్టర్ బ్లేడ్‌తో తొలగించి రాకపోకలకు అనుకూలంగా చదును చేసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఈ రహదారి ద్వారా ప్రతిరోజూ నారాయణపూర్, ఉప్పరపల్లి, చిన్నకల్వల గ్రామాలకు చెందిన దాదాపు 350 మంది రైతులు తమ పొలాలకు వెళ్తుంటారని తెలిపారు. వర్షాకాలంలో రోడ్డంతా బురదమయమై వ్యవసాయ



వాహనాలు, ట్రాక్టర్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని, పంటల తరలింపు కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీటీ రహదారి నిర్మించాలని, పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు ప్రత్యేక చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు.

# సింగిల్ విండో చైర్మన్ బొమ్మన భాస్కర్‌రావుకు ఘన సన్మానం

- గ్రామానికి గర్వకారణమన్న నాగారం సర్పంచ్ అప్పల నాగభూషణం
- నూతన చైర్మన్‌కు నాగారం గ్రామ పంచాయతీ, యాదవ సంఘం శుభాకాంక్షలు

**కోనరావుపేట, అక్టోబర్ 3 (ప్రజాజ్యోతి):** కొలనూరు సింగిల్ విండో సహకార సంఘం చైర్మన్‌గా నాగారం గ్రామానికి చెందిన బొమ్మన భాస్కర్‌రావు బాధ్యతలు చేపట్టడం గ్రామానికి గర్వకారణమని



సర్పంచ్ అప్పల నాగభూషణం, ఉప సర్పంచ్ కీర్తన బ్రహ్మాచారి అన్నారు. నాగారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బుధవారం నూతన చైర్మన్ బొమ్మన భాస్కర్‌రావును శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. అనంతరం నాగారం యాదవ సంఘం సభ్యులు కూడా ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మన గ్రామానికి చెందిన వ్యక్తి సింగిల్ విండో చైర్మన్‌గా ఎన్నిక కావడం ఎంతో సంతోషకరమన్నారు. రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ఎరువులు, విత్తనాలు, రుణాలు సకాలంలో అందేలా కృషి చేయాలని కోరారు. అనంతరం నూతన చైర్మన్ బొమ్మన భాస్కర్‌రావు మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిపేట పీఆర్టీయూ మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):** ఎల్లారెడ్డిపేట మండల పీఆర్‌టీయూ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ ఎన్నికల కార్యక్రమానికి రాష్ట్ర బాధ్యులు కూతూరి కర్ణాకర్ రెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడిగా తెల్ల పూర్ణచందర్, ప్రధాన కార్యదర్శిగా బొల్లి భగవాన్, అసోసియేట్ అధ్యక్షుడిగా గోలి ఆనంద్, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా టి. మానసవీణ, ఉపాధ్యక్షుడిగా కడదూరి మల్లారెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలిగా పులి కల్పన, కార్యదర్శులుగా సాంబారి జయరాం, బొల్లి నవీన్ కుమార్, మహిళా కార్యదర్శులుగా కల్లెపల్లి రూప, సిరిపురం త్రివేణిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



తేళ్ల పూర్ణచందర్



బొల్లి భగవాన్

నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి పీఆర్‌టీయూ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎడ్ల కిషన్ శుభాకాంక్షలు తెలుపుతూ ధన్యవాదాలు తెలియజేశారు.

# ఉత్సాహపూరితంగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

- క్రీడాకారులను పరిచయం చేసుకున్న మున్సిపల్ చైర్మన్ రాజు, ఆది కార్తీక్
- వేములవాడలో హోరాహోరీగా సాగుతున్న మ్యాచ్‌లు



**వేములవాడ, అక్టోబర్,3:ప్రజాజ్యోతి.**
వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు రెండో రోజు ఉత్సాహపూరిత వాతావరణంలో కొనసాగుతున్నాయి. పోటీలకు విచ్చేసిన క్రీడాకారులను వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, ఆది కార్తీక్ పరిచయం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, క్రీడాకారులు హోరాహోరీగా తలపడుతూ తమ ప్రతిభను చాటుకుంటున్నారని అభినందించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన 68 జట్లకు చెందిన దాదాపు 1,300 మంది క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల సౌకర్యాలు, వసతి ఏర్పాట్లు కల్పించినట్లు చెప్పారు. మైదానంలో మ్యాచ్‌లు ఆసక్తికరంగా సాగుతుండటంతో క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆటగాళ్లను ప్రోత్సహిస్తున్నారు.

# జాతీయ స్థాయి పోటీలకు వర్షిణి ఎంపిక

**కోనరావుపేట, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):**
కోనరావుపేట మండలం నిజామాబాద్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని ఎం. వర్షిణి జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. అండర్-16 విభాగంలో నిర్వహించిన పోటీలలో వర్షిణి లాంగ్ జంప్‌లో స్వర్ణ పతకం సాధించి, ఈ అర్హత సాధించింది. అక్టోబర్ 16, 17, 19 తేదీల్లో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరగనున్న జాతీయ పోటీలలో పాల్గొననుంది. వర్షిణి సాధించిన విజయం పట్ల గ్రామ సర్పంచ్ సింగం శ్రీహరి, హెచ్ఎం పోతుగంటి శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థినిని అభినందించారు.



# అనుమతులు లేకుండా కాంట్రాక్టర్ మట్టి తరలింపు

- జేసీబీతో తవ్వకాలు, టిప్పర్లతో రవాణా
- అధికారులు చర్యలు తీసుకోవాలని నర్సింగాపూర్ గ్రామస్థుల డిమాండ్





**ధర్మారం, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):**
ధర్మారం మండలం నర్సింగాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఉన్న పుట్టమన్ను బోరు వద్ద రహదారి పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా జేసీబీతో మట్టి తవ్వి టిప్పర్లలో తరలిస్తున్నారని గ్రామస్థులు ఆరోపించారు. ప్రస్తుతం నర్సింగాపూర్ నుంచి కీచులాటపల్లి వరకు కొనసాగుతున్న రహదారి నిర్మాణం కోసం పాఠశాల సమీప ప్రాంతాల నుంచి మట్టిని తోడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని, అనుమతులు లేకపోతే కాంట్రాక్టర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుని మట్టి తరలిస్తున్న టిప్పర్లను సీజ్ చేయాలని నర్సింగాపూర్ గ్రామస్థులు డిమాండ్ చేశారు.




# నంది మేడారం జెడ్పీహెచ్ఎస్‌లో సేవా కార్యక్రమం

**...విద్యార్థులకు కార్పెట్ల పంపిణీ**

**ధర్మారం, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):**
ధర్మారం మండలంలోని నంది మేడారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్) విద్యార్థులకు శనివారం కార్పెట్లను పంపిణీ చేశారు. పాఠశాల విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పెద్దపల్లి జిల్లా పీఏసీఎస్ అధ్యక్షులు, పిఎస్సిఎస్ చైర్మన్ ముత్యాల బలరాం రెడ్డి ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ ముత్యాల బలరాం రెడ్డి విద్యార్థులకు కార్పెట్లను అందజేసి మాట్లాడారు. విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యాభ్యాసం కొనసాగించాలని ఆకాంక్షిస్తూ, పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులకు సహాయం అందించిన చైర్మన్ బలరాం రెడ్డిని పాఠశాల ఉపాధ్యాయులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వీరపాల్, ఉప సర్పంచ్ రవి, నాయకులు మిట్ట తిరుపతి, మిట్ట భరత్, దేవి రమణ, పులి నవీన్, సాగర్, రాజేందర్, నర్సింగం, రాములు, రమేష్, పూర్రా గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# హజ్రత్ అయాజ్ స్వద్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్

**కోనరావుపేట, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):**
కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామంలో హజ్రత్ అయాజ్ స్వద్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రస్ట్ ఫౌండర్ సయ్యద్ అమీను పాషా, రాష్ట్ర తురుకాష ప్రధాన కార్యదర్శి సయ్యద్ షరీఫ్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు, గ్రామీణ ప్రాంత యువతలోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి టోర్నమెంట్లు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సింగం శ్రీహరి, ఉప సర్పంచ్ లంబ రాజు, నాయకులు ఈర్ల పరశరాములు, తాళ్లపెల్లి మధు, సయ్యద్ మస్తాన్, కొండం శివ, సింగం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



PRAJA JYOTHI 04-10-2026_1 10/4/2026 1:24 AM Page 8



# షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణే ధ్యేయం



- రాజకీయాలకతీతంగా ఉద్యమ కార్యాచరణకు ప్రణాళిక
- సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి స్పష్టీకరణ

**మెట్‌పల్లి, అక్టోబర్ 3 (ప్రజాజ్యోతి):** జగిత్యాల జిల్లాలోని ఏకైక వ్యవసాయ ఆధారిత పరిశ్రమ అయిన ముత్యంపేట నిజాం షుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరించడమే ప్రధాన ధ్యేయంగా ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధి సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి తెలిపారు. మెట్‌పల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధితో పాటు మెట్‌పల్లి, కోరుట్ల, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఫ్యాక్టరీ మూతపడటంతో చెరుకు రైతులు, కార్మికులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఫ్యాక్టరీ పునరుద్ధరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టకపోతే రైతులు, కార్మికులను సమీకరించి రాజకీయాలకు అతీతంగా భవిష్యత్ పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

---

## ఇటిక్యాల సహకార సంఘం చైర్మన్‌గా శ్రీనివాస్ గౌడ్

**రాయికల్, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):** ఇటిక్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్) చైర్మన్‌గా మరిపెల్లి శ్రీనివాస్ గౌడ్‌ను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు (జిఓ) జారీ చేసింది. ఆయనతో పాటు 13 మంది సభ్యులతో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. రైతుల సహకారంతో సంఘాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జగిత్యాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నందయ్యలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## విద్యుత్ లైన్‌మెన్‌పై దాడి: నిందితుడి అరెస్ట్, రిమాండ్

- సారంగాపూర్ సబ్‌స్టేషన్‌లో విధుల్లో ఉన్న ఉద్యోగిపై ఘాతుకం
- కేసు నమోదు చేసి జైలుకు తరలించిన పోలీసులు

**సారంగాపూర్, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):** విధులు నిర్వహిస్తున్న విద్యుత్ లైన్‌మెన్‌పై (ఆపరేటర్) ఓ వ్యక్తి కుర్చీతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన సారంగాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. ఈ దాడికి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జగిత్యాల వాణి నగర్‌కు చెందిన కేతా ఫణి చంద్రశేఖర్ (48) సారంగాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అక్టోబర్ 2వ తేదీ రాత్రి సుమారు 11:20 గంటల సమయంలో ఆయన కంట్రోల్ రూమ్‌లో రీడింగ్ బుక్ రాస్తుండగా, సబ్‌స్టేషన్ పక్కనే నివసించే పల్లపు రాజు (25) అనే యువకుడు అనధికారికంగా నిషేధిత ప్రాంతమైన కంట్రోల్ రూమ్‌లోకి ప్రవేశించాడు. అక్కడ విధుల్లో ఉన్న చంద్రశేఖర్‌ను కుర్చీలోంచి కిందకు నెట్టివేసి, అదే కుర్చీతో అతని తలపై బలంగా కొట్టాడు. ఈ దాడిలో లైన్‌మెన్ తలకు బలమైన రక్తగాయమైంది. అనంతరం నిందితుడు "నిన్ను చంపుతాను" అంటూ బాధితుడిని తీవ్రంగా బెదిరించాడు. తీవ్ర గాయాలపాలైన చంద్రశేఖర్‌ను 108 అంబులెన్స్ ద్వారా జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. దాడికి గల కారణం: గతంలో నిందితుడు పల్లపు రాజు తరచూ సబ్‌స్టేషన్‌లోకి వచ్చి చెత్త వేయడం, రాత్రి సమయాల్లో అక్కడ కూర్చొని ఫోన్ మాట్లాడటం వంటివి చేసేవాడు. విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున, నిషేధిత ప్రాంతమైన సబ్‌స్టేషన్‌లోకి రావద్దని చంద్రశేఖర్ అతడిని పలుమార్లు హెచ్చరించాడు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకుని కక్ష పెంచుకున్న రాజు, రాత్రి సమయంలో ఒంటరిగా ఉన్న లైన్‌మెన్‌పై ఈ ఘాతుకానికి పాల్పడినట్లు



పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. నిందితుడి అరెస్ట్: బాధితుడి ఫిర్యాదు మేరకు సారంగాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కేసును వేగంగా దర్యాప్తు చేసిన పోలీసులు, నిందితుడు పల్లపు రాజును అరెస్ట్ చేశారు. చట్టపరమైన ప్రక్రియ అనంతరం నిందితుడిని గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించినట్లు సారంగాపూర్ ఎస్.ఐ. పి. గీత తెలిపారు.



## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పరిశీలించిన డిఆర్‌డిఓ పీడీ పవన్ కుమార్

**కాల్వ శ్రీరాంపూర్, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):** కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని తారుపల్లి గ్రామంలో ఇందిరమ్మ పథకం కింద నిర్మిస్తున్న ఇండ్ల నిర్మాణ పనులను డిఆర్‌డిఓ పీడీ పవన్ కుమార్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిని పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన సాయం నిబంధనల ప్రకారం అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ గుర్రం దివ్య, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మత్స్య సహకార సంఘం నూతన పాలకవర్గానికి ఘన సన్మానం

**కాల్వ శ్రీరాంపూర్, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):** కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో శనివారం జరిగిన మత్స్య సహకార సంఘం ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన పాలకవర్గాన్ని ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గోలీ సుధాకర్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షుడు సీహెచ్ సారయ్య, ఉపాధ్యక్షుడు చిలువేరు రమేష్, కార్యదర్శి కొలిపాక అన్వేష్, కోశాధికారి బంగారి నవీన్లతో పాటు డైరెక్టర్లు చొప్పరి నాగరాజు, ఈర్ల నరేష్, కారుపాకల మల్లేష్, బండారి కొమురయ్య, రాజకుమార్లకు ఆయన అభినందనలు తెలిపారు. నూతన పాలకవర్గం సంఘ అభివృద్ధికి, మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ నాయకులు, కులస్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఆర్నకొండ ప్యాక్స్ చైర్మన్ ఎన్నం మనోహర్‌కు ఘన సన్మానం

**చొప్పదండి, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):** ఆర్నకొండ ప్యాక్స్ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన ఎన్నం మనోహర్‌ను చొప్పదండి పట్టణ పద్మశాలీ యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. పద్మశాలీ కుల సంఘం, అనుబంధ సంఘాల నాయకులు ఆయనను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. మనోహర్ ప్యాక్స్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించడం అభినందనీయమని, ఆయన నేతృత్వంలో సొసైటీ మరింత అభివృద్ధి చెంది రైతులకు, ప్రజలకు మెరుగైన సేవలు అందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ



పద్మశాలీ యువజన సంఘం అధ్యక్షుడు అనుమల్ల సత్యం, కుల ం క్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు దండె రాజయ్య, జిల్లా నాయకులు మహేశుని మల్లేశం, వల్లాల కృష్ణహరి, బూర్ల రాజేశం, ఎలిగేటి కృష్ణహరి, గుండేటి వెంకటరమణ, మంచికట్ల మల్లేశ్, కుల సంఘ ప్రతినిధులు దండే లింగన్న, ఒల్లాల జగన్, భోగ హరికిషన్, సిరిపురం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ జర్నలిస్ట్ అవార్డుకు కొంపెల్లి సతీష్ ఎంపిక

**తిమ్మాపూర్, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పొలంపల్లి గ్రామానికి చెందిన జర్నలిస్ట్ కొంపెల్లి సతీష్‌ను 'ఉత్తమ కళా పురస్కార్ అవార్డ్స్ 2026'లో ఉత్తమ జర్నలిస్ట్ పురస్కారానికి ఎంపిక చేశారు. జర్నలిజం రంగంలో ఆయన అందిస్తున్న సేవలను గుర్తిస్తూ అవార్డు కమిటీ నిర్వాహకులు ఈ పురస్కారాన్ని ప్రకటించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో, సామాజిక



అంశాలపై నిరంతరం వార్తా కథనాలు అందించడంలో సతీష్ చూపిస్తున్న కృషిని కమిటీ సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయనకు సహచర జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ.. ఈ పురస్కారం తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులోనూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిష్పక్షపాతంగా కృషి చేస్తానని పేర్కొన్నారు.

# మాజీ సింగిల్ విండో డైరెక్టర్ కుటుంబాన్ని పరామర్శించిన ప్రభుత్వ విప్



**వేములవాడ, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):** వేములవాడ మాజీ సింగిల్ విండో డైరెక్టర్ సంజీవరెడ్డి తండ్రి నల్ల పెద్ద దేవారెడ్డి ఇటీవల మృతి చెందగా, శనివారం వారి కుటుంబాన్ని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడు పెద్ద దేవారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఆది శ్రీనివాస్, అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు సంజీవరెడ్డి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## కబడ్డీ పోటీలను తిలకించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**వేములవాడ, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):** వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు రెండో రోజు అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో సాగాయి. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శనివారం సాయంత్రం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఈ పోటీలను తిలకించారు. అనంతరం పలు జిల్లాల కబడ్డీ అసోసియేషన్ల అధ్యక్ష, కార్యదర్శులను మెమొంటోలతో ఘనంగా సత్కరించారు.

**క్రీడాకారుల సౌకర్యాలపై ఆరా:**

పోటీలలో పాల్గొంటున్న క్రీడాకారులకు కల్పిస్తున్న భోజన, వసతి సౌకర్యాలపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వయంగా క్రీడాకారులను అడిగి తెలుసుకున్నారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మెరుగైన వసతులు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో క్రీడా సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.



# కరీంనగర్‌ను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

## మేయర్ కొలగాని శ్రీనివాస్

- వివిధ డివిజన్లలో రూ.1.53 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- డివిజన్లలో ముమ్మరంగా సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి పైప్‌లైన్ పనులు



కరీంనగర్, అక్టోబర్ 3 (ప్రజాజ్యోతి): కరీంనగర్ నగరపాలక సంస్థను రాష్ట్రంలోనే ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు తమ పాలకవర్గం నిరంతరం కృషి చేస్తోందని మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. శనివారం నగరంలోని 3, 11, 29వ డివిజన్లలో పర్యటించిన ఆయన స్థానిక కార్పొరేటర్లతో కలిసి పలు అభివృద్ధి పనులకు భూమిపూజలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. 11వ డివిజన్ కట్టరాంపూర్‌లో రూ.3 లక్షలతో సీసీ రోడ్డు, ఓపెన్ జిమ్ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే 3వ డివిజన్ మాణిక్యేశ్వరీనగర్‌లో రూ.24.30 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, 29వ డివిజన్ కిసాన్‌నగర్, మింగనివాడల్లో రూ.70 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం 28, 29వ డివిజన్లలో రూ.56 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన మంచినీటి పైప్‌లైన్ అభివృద్ధి పనులను ప్రారంభించారు. పనులన్నీ నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలపై పోరుబాట: ఏఐఎస్ఎఫ్ పిలుపు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలపై ఉద్యమిస్తాం
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి వెల్లడి




**కరీంనగర్, అక్టోబర్ 3 (ప్రజాజ్యోతి):** విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి విమర్శించారు. బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో రెండోసారి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అవకతవకలకు బాధ్యత వహిస్తూ జాతీయ ఎన్నికల ప్రధానాధికారి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాశాఖను తన వద్ద ఉంచుకున్నప్పటికీ విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎన్నికల వేళ ఇచ్చిన విద్యా భరోసా, ల్యాప్‌టాప్‌లు, ఎలక్ట్రిక్ స్కూటీలు, ఉచిత ఇంటర్నెట్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో నీట్ ఉద్యమ స్ఫూర్తితో విద్యార్థులను సమీకరించి విద్యారంగ సమస్యలపై పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మచ్చ రమేష్, రేణికుంట్ల ప్రీతం, మంద అనిల్, కుర్ర రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

### బీర్‌పూర్ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీల లెక్కింపు

**బీర్ పూర్, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):** జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో ఈ నెల 5న (సోమవారం) హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయమై ఆలయ కార్యనిర్వహణాధికారి డి. కిరణ్ ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం ఉదయం 10:00 గంటల నుండి ఆలయ ప్రాంగణంలో హుండీలను విప్పి, భక్తులు స్వామివారికి సమర్పించిన నగదు మరియు ఇతర కానుకలను లెక్కించనున్నట్లు తెలిపారు. దేవదాయ ధర్మదాయ శాఖ నిబంధనల ప్రకారం సాగే ఈ లెక్కింపు ప్రక్రియకు అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.



# నూతన పాలకవర్గానికి ఘన సన్మానం

**కాల్వ శ్రీరాంపూర్, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):** కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో శనివారం జరిగిన మత్స్య సహకార సంఘం ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన పాలకవర్గాన్ని ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గోలీ సుధాకర్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షుడు సీహెచ్ సారయ్య, ఉపాధ్యక్షుడు చిలువేరు రమేష్, కార్యదర్శి కొలిపాక అన్వేష్, కోశాధికారి బంగారి నవీన్‌లతో పాటు డైరెక్టర్లు చొప్పరి నాగరాజు, ఈర్ల నరేష్, కారుపాకల మల్లేష్, బండారి కొమురయ్య, రాజకుమార్‌లకు ఆయన అభినందనలు తెలిపారు. నూతన పాలకవర్గం సంఘ అభివృద్ధికి, మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ నాయకులు, కులస్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్టీసీ డిపోల్లో ఐక్య కూటమి విస్తృత ప్రచారం

**మెట్‌పల్లి, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):** ఈ నెల 9న జరగనున్న టీజీఎస్ఆర్టీసీ ఎన్నికల నేపథ్యంలో ఐక్య కూటమి సంఘాల ఆధ్వర్యంలో మెట్‌పల్లి, కోరుట్ల ఆర్టీసీ డిపోల్లో శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. విధుల్లో ఉన్న ఆర్టీసీ సిబ్బందిని నేరుగా కలిసి ఐక్య కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని నాయకులు కోరారు. ఈ ప్రచారంలో ఆర్టీసీ ఐక్య కూటమి సంఘాల చైర్మన్ ఈర్ల వెంకటేశ్వర్లు, నాయకులు కొమురయ్య, మౌలానా, సత్యపాల్‌లతో కలిసి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఏశమేని గణేష్ పాల్గొన్నారు. కార్మికుల సమస్యలు, హక్కులు, ఉద్యోగ భద్రత అంశాలపై సిబ్బందితో చర్చించి, ఐక్య కూటమికి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీడీ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి సుతారి రాములు, మున్సిపల్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.డి. ఉస్మాన్, ఖాతా వినయ్, చౌదరి శివకుమార్, ఓడల రాకేష్, శ్రావణ్, రాజశేఖర్, భోజ సంపత్ తదితరులు పాల్గొన్నారు.



# 'అభయ హస్తం'.. అక్షర సేవలో రాజేశ్వర్ సార్

**113 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగుల పంపిణీ**

- **రిటైరైనా వీడని సేవాభావం.. పిల్లల ముఖాల్లో చిరునవ్వులు**
- **ఘనంగా సన్మానించిన బీర్ పూర్ మండల విద్యాశాఖ, ఉపాధ్యాయ లోకం**



**బీర్ పూర్, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):**
ఉపాధ్యాయ వృత్తి నుంచి రిటైరైనా.. విద్యార్థులపై ఆయనకున్న ప్రేమ, సేవాభావం మాత్రం ఏమాత్రం తగ్గలేదు. ఒకప్పుడు గురువుగా ఎంతోమందిని తీర్చిదిద్దిన ఆ మాస్టారు.. నేడు పేద విద్యార్థులకు అండగా నిలిచి తన ఉదారతను చాటుకున్నారు. బీర్ పూర్ మండలంలోని మంగేల ఎంపీయూపీఎస్ పాఠశాలలో శనివారం నిర్వహించిన విశేష కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త, రిటైర్డ్ ఉపాధ్యాయులుహోటోటి. రాజేశ్వర్ సార్ తన సొంత ఖర్చులతో 113 మంది విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. పాఠశాలల వికాసానికి, పేద విద్యార్థుల అభ్యున్నతికి రాజేశ్వర్ సార్ అందిస్తున్న సహాయ సహకారాలు ఎంతో అభినందనీయమని మండల విద్యాశాఖ, ఉపాధ్యాయ లోకం కొనియాడింది.

రాజేశ్వర్ సార్ నేడు విద్యార్థులకు అవసరమైన పాఠశాల బ్యాగులను అందించి వారి ముఖాల్లో చిరునవ్వులు నింపడం పట్ల మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సభలో పాల్గొన్న ప్రముఖులు మాట్లాడుతూ.. రాజేశ్వర్ సార్ చేసిన ఈ ఉదార కార్యక్రమం సమాజంలోని ఇతర దాతలకు, పూర్వ విద్యార్థులకు ఎంతో స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. ఆయన సేవలను ఆదర్శంగా తీసుకుని మరికొందరు దాతలు ముందుకు వచ్చి ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు తమవంతు సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. ఈ అభినందన సభలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.డి. ముజకిర్ పాషా, మంగేల గ్రామ సర్పంచ్ బనక సతీష్, బీర్పూర్ మండలం ఉపసర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు దగ్గుల వీరేశం, ఎస్ఎంసి చైర్మన్ సాయినవేణి పద్మ, వార్డ్ మెంబర్ పసే రాజేశ్వరి, కండ్లపల్లి హెచ్ఎం వేణుగోపాల్, టి.ఆర్.టి.ఎఫ్ మండల అధ్యక్షులు నరేడ్ల భూమారెడ్డి, గొలనూ మధుసూధన్, గ్రామ కార్యదర్శి అజ్మీర వినోద్, ఉపాధ్యాయులు ఎర్రోళ్ల శాస్త్రి, సంతోష్ కుమార్, జమున, జితేందర్, గ్రామ ప్రజలు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొని దాత ఎ. రాజేశ్వర్ సార్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



## మాజీ మంత్రి పరామర్శ

**బుగ్గారం, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):**
బుగ్గారం మండలం చిన్నాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మహిళా నాయకురాలు మ్యాకల మమత తల్లి మ్యాకల మల్లమ్మ ఇటీవల మృతి చెందగా, శనివారం వారి కుటుంబాన్ని రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. మల్లమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించిన ఆయన, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎండి అబ్దుల్ రెహమాన్, దొరగాండ్ల జగన్, వీరమల్ల సందీప్, పాదం కొమరయ్య, పాదం సత్తన్న తదితరులు పాల్గొన్నారు.



## మల్లాపూర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా వంశీధర్‌రెడ్డి



**మల్లాపూర్, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):**
మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కార్యవర్గం శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకోబడింది. గౌరవ అధ్యక్షుడు మురళి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మండల అధ్యక్షుడిగా వంశీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అశోక్, కోశాధికారిగా హరీష్, ఉపాధ్యక్షుడిగా సురేష్ ఎన్నికయ్యారు. పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి తెలిపారు.

## హిందూ సమాజ ఐక్యతతోనే ధర్మ పరిరక్షణ: అప్పాల ప్రసాద్

- **ఘనంగా సంత్ శిరోమణి గురు రవిదాస్ 650వ జయంతి ఉత్సవాలు**
- **బీర్‌పూర్‌లో 17 గ్రామాల ప్రముఖుల ఆత్మీయ సమావేశం**

**బీర్ పూర్, అక్టోబర్ 3 (ప్రజా జ్యోతి):**
కులాంతర భేదాలను విడనాడి హిందూ సమాజం ఐక్యంగా నిలిచినప్పుడే ధర్మ పరిరక్షణ సాధ్యమవుతుందని సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్ పిలుపునిచ్చారు. సంత్ శిరోమణి గురు రవిదాస్ 650వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలం తుంగూరులోని ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో 17 గ్రామాల ప్రముఖులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య వక్తగా హాజరైన అప్పాల ప్రసాద్ మాట్లాడుతూ.. "ఇంటిలోనే కులం... గడప దాటితే మనమందరం హిందువులమే" అనే సమరసత భావన ప్రతి ఒక్కరిలో బలంగా నాటుకుపోవాలన్నారు. సమాజంలో కుల, మత భేదాలు లేకుండా సోదరభావంతో ముందడుగు వేస్తూ మన సంస్కృతిని, ధర్మాన్ని కాపాడుకోవాలని కోరారు. అనంతరం ప్రముఖులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సామాజిక సమరసత వేదిక కరీంనగర్ విభాగ్ కన్వీనర్ చిట్ల గంగాధర్, జగిత్యాల జిల్లా గౌరవాధ్యక్షుడు కనికరం లచ్చన్న, సర్పంచ్ రాజగోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.



PRAJA JYOTHI 04-10-2026_1 10/4/2026 1:24 AM Page 12



కోరుట్ల పట్టణంలో కొన్ని కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల వసూళ్ల వ్యవహారం విద్యార్థులు, తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. చదువుకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన విద్యాసంస్థల్లో ఫీజుల వసూళ్లకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు తల్లిదండ్రుల నుంచి వస్తున్నాయి.ఫీజులు పూర్తిగా చెల్లిస్తేనే పరీక్షలకు అనుమతిస్తామని, బకాయిలు ఉన్న విద్యార్థులను పరీక్షలకు దూరంగా ఉంచుతామని కొన్ని పాఠశాలల యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ఫీజులు చెల్లించని విద్యార్థులను పాఠశాలకు పంపవద్దంటూ తల్లిదండ్రులకు సూచిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

కోరుట్ల, అక్టోబర్ 3 (ప్రజాజ్యోతి):



## విద్యార్థులను ఫీజుల కోసం వేధించడం సరికాదు.

### అజార్ భాయ్

కోరుట్ల నియోజకవర్గ తెలంగాణ రక్షణ సేన నాయకుడు అజార్ భాయ్ మాట్లాడుతూ.. ఫీజుల బకాయిల పేరుతో విద్యార్థులను పరీక్షలకు దూరం చేయడం, పిల్లలపై ఒత్తిడి తీసుకురావడం సరికాదన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పాఠశాల యాజమాన్యాలు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కోరారు. ఫీజుల వసూళ్లపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, విద్యార్థులు ఇబ్బందులకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఫీజులు కట్టకపోతే పరీక్షలకు నో ఎంట్రీ?

పరీక్షల సమయం కావడంతో ఫీజుల అంశం మరింత తీవ్రంగా మారిందని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఫీజులు బకాయి ఉన్న విద్యార్థులకు పరీక్షలకు అనుమతి ఉండదని చెప్పడం వల్ల పిల్లల్లో ఆందోళన నెలకొంటోందని వారు పేర్కొంటున్నారు, విద్యార్థుల ప్రతిభను అంచనా వేయాల్సిన పరీక్షలను ఫీజుల చెల్లింపుతో ముడిపెట్టడం ఎంతవరకు సమంజసమని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

# కోరుట్లలో కార్పొరేట్ స్కూళ్ల ఫీజుల దౌర్జన్యం!




### ఫీజులు చెల్లిస్తేనే పరీక్షలకు అనుమతి అంటూ విద్యార్థులపై ఒత్తిడి?

- బకాయిలు ఉంటే పిల్లలను స్కూల్‌కు పంపొద్దంటూ తల్లిదండ్రులకు హెచ్చరికలంటూ ఆరోపణలు
- పిల్లలతో చెలగాటం.. తల్లిదండ్రులపై ఫీజుల భారం
- కార్పొరేట్ స్కూళ్ల తీరుపై తల్లిదండ్రుల ఆగ్రహం.. విద్యాశాఖ అధికారుల మౌనంపై ప్రశ్నలు

### పిల్లలతో చెలగాటం.. తల్లిదండ్రులపై ఫీజుల భారం?

పాఠశాల ఫీజులతో పాటు పుస్తకాలు, యూనిఫాం, రవాణా, ఇతర విద్యా ఖర్చులు భరిస్తున్న కుటుంబాలపై అదనపు ఫీజుల ఒత్తిడి తీవ్ర భారంగా మారుతోందని పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫీజులు ఆలస్యమైన సందర్భాల్లో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయకుండా, తల్లిదండ్రులతో నేరుగా మాట్లాడి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

### విద్యార్థుల ముందు ఫీజుల ప్రస్తావన వద్దు

ఫీజుల బకాయిల విషయాన్ని విద్యార్థుల ముందు పదేపదే ప్రస్తావించడం, ఇతర విద్యార్థుల ముందు ఇబ్బందులకు గురిచేయడం వల్ల పిల్లలపై మానసిక ఒత్తిడి ఏర్పడే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పిల్లలు చదువుకోవడానికి స్కూల్‌కు వెళ్తున్నారు.. కుటుంబ ఆర్థిక పరిస్థితులపై ఆందోళన చెందడానికి కాదు అని వారు పేర్కొంటున్నారు.

### కార్పొరేట్ వ్యవస్థపై విద్యాశాఖకు పట్టింపు లేదా?

కోరుట్ల పట్టణంలో కార్పొరేట్ పాఠశాలలు నిర్వహిస్తున్న తీరుపై తల్లిదండ్రులు ప్రశ్నలు సంధిస్తున్నారు. ఫీజుల వసూళ్లు, విద్యార్థులపై ఒత్తిడి, పరీక్షలకు అనుమతి వంటి అంశాలపై విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నారా? లేదా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.కార్పొరేట్ పాఠశాలల వ్యవస్థ ఎక్కడి నుంచి నడుస్తోంది? విద్యార్థులు, తల్లిదండ్రులపై జరుగుతున్న ఫీజుల ఒత్తిడిని అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

### అధికారుల తనిఖీలు ఎక్కడ?

పాఠశాలల్లో ఫీజుల వసూళ్ల విధానం, విద్యార్థులపై ఒత్తిడి, పరీక్షలకు అనుమతి వంటి అంశాలపై విద్యాశాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.ఆరోపణల్లో వాస్తవం ఎంత? పాఠశాలలు నిబంధనలను పాటిస్తున్నాయా? విద్యార్థులను ఫీజుల కోసం ఒత్తిడికి గురిచేస్తున్నారా? అనే అంశాలపై అధికారులు విచారణ చేపట్టాలని కోరుతున్నారు.

### ఫీజుల పేరుతో విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం వద్దు

ఫీజుల సమస్య తల్లిదండ్రులు--యాజమాన్యాల మధ్య ఆర్థిక అంశంగా పరిష్కరించుకోవాల్సిందే తప్ప, దాని ప్రభావం విద్యార్థుల తరగతులు, పరీక్షలు, చదువుపై పడకూడదని తల్లిదండ్రులు స్పష్టం చేస్తున్నారు.ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు విడతలవారీగా ఫీజులు చెల్లించే అవకాశం కల్పించాలని వారు కోరుతున్నారు.

### విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించాలి

కోరుట్లలోని కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల వసూళ్లపై వస్తున్న ఆరోపణలను విద్యాశాఖ అధికారులు సీరియస్‌గా తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. సంబంధిత పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని డిమాండ్ చేస్తున్నారు.ఆరోపణలు నిజమైతే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, వాస్తవం కాదంటే పాఠశాలల నుంచి స్పష్టత తీసుకుని తల్లిదండ్రులకు తెలియజేయాలని వారు కోరుతున్నారు.

### పిల్లల భవిష్యత్తుతో చెలగాటం వద్దు.. ఫీజుల వసూళ్లపై విద్యాశాఖ నిఘా పెట్టాలి

ఇప్పటికైనా కోరుట్ల విద్యాశాఖ అధికారులు స్పందించి కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల వసూళ్ల తీరుపై సమగ్రంగా విచారణ చేపట్టాలని, విద్యార్థులను ఎలాంటి ఒత్తిడికి గురిచేయకుండా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.